క్లుప్తంగా

క్యాంపస్ సెలక్షన్స్‌లో 28 మందికి ఉద్యోగాలు

భీమవరం: స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ కళాశాలలో ఉపాధి కల్పన కార్యాలయం, నేషనల్ కేరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 28 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన శనివారం తెలిపారు. సెలక్షన్స్‌కు 55 మంది విద్యార్థులకు హాజరుకాగా బజాజ్ కాపిటల్ ఇన్సూరెన్స్ కంపెనీకి 15 మంది, ఐశ్వర్య ఫెర్టిలిటీ సెంటర్‌కు ఐదుగురు, కుశలవ హ్యుండాయ్‌కు ముగ్గురు, ముత్తూట్ ఫైనాన్స్‌కు ఐదుగురు ఎంపికయ్యారని చెప్పారు. ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సి.భూషణ్‌రావు, కళాశాల అధ్యాపకులు ఎస్ లక్ష్మీకాంతం, అరవిందస్వామి పాల్గొన్నారు.

లక్ష తులసి పూజ

వీరవాసరం: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని శ్రీకృష్ణదేవరాయ కాపు, తెలగ, బలిజ సంఘ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని రాయకుదురు శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష తులసి పూజ చేశారు. విశ్వక్సేన పూజ, పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. స్వామివార్లకు కల్యాణం మహోత్సవం కనులు పండుగ నిర్వహించారు. లక్ష తులసి పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తొలుత స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. తోట చంటి దంపతులు, నారాయణం శ్రీనివాస్ దీక్షితులు, నారాయణం ఫణి, శ్రీకృష్ణదేవరాయ కాపు, తెలగ, బలిజ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే కార్మికులకు న్యాయం

ఆకివీడు: ఐక్యతతో మెలిగినప్పుడే కార్మికులకు న్యాయం జరుగుతుందని ఎలక్ట్రికల్, ప్లంబర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అంబళ్ల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎలక్ట్రికల్, ప్లంబర్స్ అసోసియేషన్ 6వ వార్షికోత్సవం స్థానిక సాయిబాబా ఆలయ సమీపంలో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలక్ట్రికల్, ప్లబంర్ పనులకు ఇతర రాష్ట్రాల వలస కార్మికులు వస్తున్నారని, దీంతో స్థానిక కార్మికులు ఉపాధి కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులంతా గుర్తింపు కార్డులు పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కింతాడ కృష్ణమోహన్, ఉప కార్యదర్శి సుంకవల్లి నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు బండారు నటరాజ్, నరహరశెట్టి నానాజీ, పట్టణ అధ్యక్షుడు యర్రా కేశవ, ఆవాల సత్యనారాయణ, కొప్పర్తి, సత్యనారాయణ, మామిడి వీర దుర్గారావు, అబ్దుల్ సర్ధార్ పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు


కాళ్ల : కోపల్లె హైస్కూల్లో వాలీబాల్ ఆడుతున్న జట్లు


కాళ్ల : మాలవానితిప్ప హైస్కూల్లో వాలీబాల్ ఆడుతున్న జట్లు


ఆకివీడు : చెరుకుమిల్లిలో వాలీబాల్ పోటీల్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

కాళ్ల: ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో పాల్గొనేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు. ఏలూరుపాడు, కాళ్ల, కలవపూడి, సీసలి, కోపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామల పరిధిలో ఉన్న 21 సచివాలయాల్లో వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి.

ఆటల్లో రాణించాలి

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం, చినకాపవరం, సిద్దాపురం, చెరుకుమిల్లి, ఆకివీడులో శనివారం కొనసాగాయి. వాలీబాల్, కబడీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. పండుగ రోజుల్లో క్రీడల్ని నిర్వహించడం వల్ల యువత క్రీడాసక్తిని పెంపొందించుకుంటారని చెరుకుమిల్లి గ్రామ సర్పంచ్ నందమూరి ప్రకాశం అన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

వీరవాసరం: మండల కేంద్రమైన వీరవాసరం, తోలేరు, కొణితివాడ, మత్స్యపురి గ్రామాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, సర్పంచులు గెడ్డం భారతి, చికిలే మంగతాయారు, బిశెట్టి లక్ష్మి, బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి, నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, నూకల కనకారావు, వీరవల్లి కనక ఉషారాణి, బోను జ్యోష్ణ దేవి, నాగరాజు పద్మ కళ ,పెంటకోటి సైజేశ్వరరావు, కె.జ్యోతి పాల్గొన్నారు.

భీమవరం మండలంలో...

భీమవరం అర్బన్: మండలంలో దిరుసుమర్రు, యనమదుర్రు, తాడేరు, బేతపూడి, రాయలం, చినఅమిరం, గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, తోకతిప్ప, నాగిడిపాలెం, దొంగపిండి, లోసరి, అనాకోడేరు, కొమరాడ, తుందుర్రు, వెంప తదితర గ్రామాలలో వాలీబాల్, క్రికెట్, బాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు.

864 మ్యాచ్‌ల నిర్వహణ

భీమవరం: ఆడుదాం ఆంధ్ర క్రీడలు పశ్చిమగోదావరి జిల్లాలో ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లాలోని 535 సచివాలయాల పరిధిలో శనివారం 864 మ్యాచ్‌లు నిర్వహించగా 10 వేలమందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడలను తిలకించడానికి ప్రేక్షకులు ఆసక్తి చూపించారు. జిల్లాలో దాదాపు 25 వేల మంది వరకు క్రీడలను తిలకించినట్లు జిల్లా చీఫ్ కోచ్ డి.దుర్గారావు చెప్పారు.


వీరవాసరం : తోలేరులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం


భీమవరం అర్బన్ : నాగేంద్రపురంలో ఖో ఖో ఆడుతున్న దృశ్యం


ఆకివీడు : నగర పంచాయతీ పరిధిలో క్రికెట్ ఆడుతున్న యువకులు

సాంకేతిక ఆవిష్కరణలవైపు పయనించాలి

భీమవరం: విద్యార్థులు కేవలం పుస్తకపఠనానికి మాత్రమే పరిమితంగాకుండా నూతన సాంకేతిక ఆవిష్కరణలవైపు పయనించాలని భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ దశిక సూర్య నారాయణ అన్నారు. కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన 10వ వేలియంట్-2కే23 ముగింపు సందర్భంగా శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలలో ఏటా వేలియంట్ నిర్వస్తామని దీనిలో దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొంటారన్నారు. విద్యార్థులు సాంకేతిక ప్రతిభతోపాటు ఫ్లాష్‌మాబ్ వంటి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు చేసి అలరించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కన్వీనర్ ఆర్ శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాము తనిఖీ


గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము వద్ద ఏర్పాట్లు, బందోబస్తు, వెబ్‌కాస్టింగ్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీప్యాట్లు తదితర ఎన్నికల సామగ్రిని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో పరిశీలించినట్టు చెప్పారు. ఈవీఎంల గోదాము ప్రాంగణంలో ఆర్మ్‌డ్, సాధారాణ పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. పోలీసులు నిర్వహించాల్సిన విధులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, ఎలక్షన్ తహసీల్దార్ వై.దుర్గా కిషోర్, డిప్యూటీ తహసీల్దార్ ఎం సన్యాసిరావు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, కామన నాగేశ్వరరావు, మరపట్ల శ్యాం బాబు, కోమటి రవికుమార్ పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ఆకివీడు : సమాజం సన్మార్గంలో నడిచే విధంగా క్రీస్తు బోధనలున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి రమేష్ అన్నారు. స్థానిక మాదివాడ చర్చిలో శుక్రవారం రాత్రి యూత్, చిల్డ్రన్ క్రిస్మస్ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. అంబటి కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించి క్రిస్మస్ వేడుకను ప్రారంభించారు. మనుషులంతా ఒక్కటేనని, ప్రేమతత్వంతో మెలగాలని, అన్ని మతాల వారూ కలిసిమెలిసి జీవించే మనస్తత్వం కలిగి ఉండాలని క్రీస్తు బోధించారని వివరించారు. సండే స్కూల్ విద్యార్థులు క్రిస్మస్ పాటలు, వివిధ నాటికలతో అలరించారు. అంతర్జాతీయ ప్రసంగికులు పళ్లెం ఏసు రత్నం, ఇంటి చార్లెస్, సీఆర్ గండి రాజు, సీఆర్ సీబీసీఎన్‌సీ, ఆర్సీఎం సంఘస్తులు, స్త్రీల సంఘం, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన నాయకులు


సీఎం జగన్‌తో జయ రామకృష్ణంరాజు


సీఎం జగన్‌తో హరివర్మ

కాళ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కాళ్ల నాయకులు కలిశారు. భీమవరం పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. వీరిలో కోపల్లె సొసైటీ చైర్మన్ జయ రామకృష్ణంరాజు, సీనియర్ నాయకులు సాగిరాజు హరివర్మ, సోషల్ మీడియా కార్యకర్తలు ఉన్నారు.

దాసాంజనేయ స్వామి హుండీ ఆదాయం రూ.1,19,795

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మారుతి టాకీస్ సెంటర్‌లోని దాసాంజనేయ స్వామి దేవస్థానం హుండీల ఆదాయం రూ.1,19,795 వచ్చిందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి గొట్టుముక్కల నాగ సీతారామరాజు తెలిపారు. లెక్కింపు కార్యక్రమాన్ని శ్రీ శక్తీశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కె.శ్రీనివాసరావు పర్యవేక్షించగా, ధర్మకర్తలు రంగ బాబు, రాధాకృష్ణ, శ్యామ్ పాల్గొన్నారు.

గొల్లవానితిప్పలో వేగంగా అభివృద్ధి పనులు

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. సర్పంచ్ చిల్లే వెంకటేష్, ఉప సర్పంచ్ బుద్దాల రామకృష్ణ, పర్యవేక్షణలో రామాయణపురంలో 14 వార్డులో రూ. 6 లక్షల నిధులతో రోడ్డు నిర్మాణం, గొంది గ్రామానికి వెళ్లే రోడ్డు రూ.కోటి 4 లక్షలతో, మరో రూ.12 లక్షలతో అంతర్గత రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్లు వర్షాలకు ధ్వంసం కావడంతో గ్రామస్తులు, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో నిధులు మంజూరు చేసి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


జేసీబీతో రోడ్డు చదును చేస్తున్న దృశ్యం

2 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

ఉండి: జనవరి రెండో తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఏవీవీఎస్ఆర్ఎస్ కొండలరావు శనివారం తెలిపారు. జనవరి 2న కలిగొట్ల, 9న అర్తమూరు, 19న చెరుకువాడ, 27న కోలమూరు, ఫిబ్రవరి 2న ఉప్పులూరు, 9న కలిసిపూడి, 16న పాందువ్వ, 23న పెదపుల్లేరు, మార్చి 1న చిలుకూరు, 12న ఉండి-2, 22న ఉండి-3, 26న ఉణుదుర్రు, ఏప్రియల్ 6న యండగండి-1, 12న ఉండి-4, 19న మహదేవపట్నం-1, 26న ఎన్నార్పీ అగ్రహారం, మే 3న మహదేవపట్నం-2, 10న వాంద్రం, 17న పాములపర్రుల్లో నిర్వహిస్తామన్నారు.

చినపేటలో క్రిస్మస్ వేడుకలు

భీమవరం: పట్టణంలోని చినపేట చర్చ్ ఆఫ్ క్రైస్ట్ దైవ సేవకులు దాగారపు లూసిఫర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ శాంతికి క్రీస్తు బోధనలు ఎంతో ఉపయోగపడ్డాయని అన్నారు. ప్రతి సంవత్సరం క్రిస్మస్ వేడుకలను దాదాపు లూసిఫర్ ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. అనంతరం ఆయనను చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.


క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

ఎఫిఫానియా లూథరన్ ఆలయంలో..

భీమవరం ఎఫిఫానియా లూథరన్ దేవాలయంలో సండే స్కూల్ యూత్ క్రిస్మస్ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పారిష్ పాస్టర్ అబ్రహం లింకన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వి.షైనీ, స్వీటీ, హర్షిణి పాల్గొన్నారు.

అనుమానంతో భార్యపై దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన పరిధిలో శనివారం భార్యపై అనుమానంతో భర్త దాడి చేయడంతో ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం అనాకోడేరు గ్రామ పంచాయతీలో తుమ్మగొప్పి గ్రామానికి చెందిన బాలం భవానీ తన బావగారితో మాట్లాడడంతో అనుమానించిన భర్త విజయ్‌కుమార్ ఆమెను కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు భవానీని భీమవరంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం మహిళ మరో చర్చికి వెళ్తుతుందని కొందరు దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం ఎల్‌వీఎన్‌పురం గ్రామానికి చెందిన నేలపాల రాణి చర్చికి వెళ్తుంటుంది. అయితే దగ్గరలో ఉన్న చర్చి రాకుండా మరో చర్చికి ఎందుకు వెళ్తుతున్నావు? అని మల్లాడి పెద్దింట్లు మరో ఏడుగురు నేలపాల రాణి ని కొట్టి గాయపర్చడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది.

దాడిపై కేసు నమోదు

ఉండి: ఆస్తితగాదాల నేపథ్యంలో వ్యక్తిపై దాడికి తెగబడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉండి మండలం యండగండి గ్రామానికి చెందిన పేరిచెర్ల సత్య సుబ్బవరహాలరాజును అతని బంధువైన పేరిచెర్ల వెంకటపతిరాజు ఆస్తితగాదాల నేపథ్యంలో కొట్టి గాయపరిచాడు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం పెద్దల సమక్షంలో సర్దుబాటుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తును ఏఎస్సై ఎ.సూర్యనారాయణ చేపట్టారు.

గాయపరచిన వ్యక్తిపై కేసు

ఉండి కోండ్రోతుపేటకు చెందిన మజ్జి సత్యనారాయణ అనే వ్యక్తిని ఉండి సెంటర్‌లో అల్లు సాయి అనే వ్యక్తి ఇటుకతో తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తి భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేపట్టారు.

8 మంది అరెస్ట్

ఉండి మహదేవపట్నం శివారు డిష్టలరీ గోడౌన్ సమీపంలో పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ తెలిపారు. వారి నుంచి రూ.6290, సెల్‌ఫోన్లు ఆరు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు.

జూదరుల అరెస్ట్

పాలకోడేరు: కుముదవల్లి గ్రామ శివారులో శనివారం పేకాట ఆడుతున్న జి.సత్యనారాయణ రెడ్డి మరో ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. వారి నుంచి రూ.2 వేలు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్ట చెప్పారు.

బైక్‌ను ఢీకొట్టిన రొయ్యల వ్యాన్

మోగల్లు గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు జోషఫ్ రాజు (18) ఈ నెల 29న మోగల్లు నుంచి భీమవరం బైక్‌పై వస్తుండగా ఎదురుగా వస్తున్న రొయ్యల వ్యాన్ ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన రాజు భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రొయ్యల వ్యాన్ నడుపుతున్న డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.